ప్రజాశక్తి
బుధవారం 26 జూన్ 2024 5
అనంతపురం






మెడలో కూరగాయల హారం వేసుకుని ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

నామినేటెడ్‌పై ఆశలు

◆గ్రూపుల వారీగా జాబితాలు తయారీ

◆తమకే ఇవ్వాలంటూ నేతల వద్ద విజ్ఞప్తులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ప్రకటించడంతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. అప్పుడే పదవులు ఆశించే వారంతా తమతమ నాయకుల వద్దకు చేరుకుంటున్నారు. ఈసారైనా తప్పకుండా పదవులు లభించే విధంగా సిఫార్సు చేయాలని కోరుతున్నారు. ఈ ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్‌లో అవకాశాలు కల్పించాలని ప్రజాప్రతినిధుల వద్దకు ఆశావహులు చేరకుంటున్నారు. తమకు కావాలంటే తమకంటూ పోటీపడుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు పడ్డామని నేతల దృష్టికి తీసుకెళుతున్నారు. ఇటువంటి వారిని గుర్తించి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు.

గ్రూపుల వారీగా జాబితాలు

తెలుగుదేశం పార్టీలో అనేక చోట్ల గ్రూపులున్నాయి. ఎన్నికల సమయంలోనూ ఈ గ్రూపులు కొనసాగాయి. కలసి పనిచేయడంతో సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి ఘన విజయం లభించింది. నామినేటెడ్ పదవులు వచ్చే సరికి ఈ గ్రూపులు మరోమారు యాక్టివ్ అయ్యాయి. తమ గ్రూపునకు సంబంధించిన వారికే నామినేటెడ్‌లో అవకాశాలు కల్పించే విధంగా చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో తమ వర్గాలను సిద్ధం చేసుకుంటున్నారు. అనంతపురం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో నాలుగు నియోజకవర్గాల్లో పాత నేతలుండగా, కొత్త నేతలు ఇప్పుడు ప్రజాప్రతినిధులుగా అయ్యారు. పాత, కొత్త నేతల తమతమ అనుయాయులకు నామినేటెడ్ పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వైసిపి తరహాలో భర్తీ చేసేరా ?

గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులు పెద్దఎత్తునే జిల్లాకు వచ్చాయి. రాష్ట్ర స్థాయి పోస్టులు కూడా వచ్చాయి. అయితే అదే స్థాయిలో తెలుగుదేశం పార్టీ కూడా పదవులు ఇస్తుందా లేదా అన్న సందిగ్ధత తెలుగుదేశం శ్రేణుల్లోనూ నెలకొంది. ఎందుకంటే అంతకు మునుపు 2014 సమయంలో అనేక పోస్టులు భర్తీ చేయలేదన్న అంతృప్తి ఉంది. ఈసారి అందుకు భిన్నంగా నామినేటెడ్ పోస్టులను భర్తీని సంపూర్ణంగా చేపడతారన్న ఆశాభావం కూడా వ్యక్తమవుతోంది. ఇప్పటికే వైసిపి నామినేటెడ్ పోస్టుల్లోనున్న వారందరూ రాజీనామాలు చేశారు. ఈ ఖాళీ స్థానాలను త్వరలో భర్తీ చేయనున్నారు. వీటి కోసం తెలుగుదేశం నేతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు.

ధరలను నియంత్రించడంలో

బిజెపి విఫలం

◆ కార్పొరేట్లకు మేలు చేసేలా చర్యలు

◆కూరగాయల దండలతో అనంతలో సిపిఎం నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పదేళ్లుగా పరిపాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం నిత్యావసరాలు, కూరగాయల ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని సిపిఎం నాయకులు విమర్శించారు. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకులు, కూరగాయ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం అనంతపురం టవర్ క్లాక్ దగ్గర సిపిఎం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కూరగాయల హారాన్ని మెడలో తగిలించుకుని వినూత్నంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. పెట్టుబడిదారులకు ఊడిగం చేయడమే నరేంద్ర మోడీకి తెలిసిన పాలన అని విమర్శించారు. కార్పొరేట్లు నూతన టెక్నాలజీని ఉపయోగించుకొని పంటలను పండించి అధిక ధరలకు అమ్ముకునేలా కేంద్ర ప్రభుత్వం వారికి సహకారాలు అందిస్తోందన్నారు. రైతులను విస్మరించి కార్పొరేట్‌కు మాత్రం అన్ని విధాలా సాయం అందిస్తోందని విమర్శించారు. రైతులను వ్యవసాయం నుంచి దూరం చేయడమే బిజెపి పాలనలా ఉందన్నారు. వ్యాపారుల కోసం కృత్రిమ కొరతను సృష్టించి కావాలనే సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలపై ధరాభారాలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కోల్డ్ స్టోరేజ్, గోడౌన్లో వ్యాపారులు అక్రమంగా నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులను బయటకు తీయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూరగాయలను రైతు బజార్లలో ప్రభుత్వమే తక్కువ ధరలకు విక్రయించాలని కోరారు. బ్లాక్ మార్కెట్లలో అమ్ముతున్న వ్యాపారస్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వలీ, బాలకృష్ణ, మసూద్, శీనా, ఎర్రిస్వామి, నూరుల్లా, లక్ష్మీనారాయణ, డేవిడ్, మురళి పాల్గొన్నారు.



ఆర్ఐఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిబంధనలు పాటించకున్నా పట్టించుకోరా..?

ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకోండి

ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని పలు ప్రయివేటు కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోరా అని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు ప్రశ్నించారు. ప్రయివేటు కళాశాలలు నిబంధనలకు నిళ్లొదులుతున్నా స్పందించకుండా వాటిపై ప్రేమ చూపుతున్న ఆర్ఐఒ వెంకటరమణ నాయక్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్‌బి, బీసీ,ఎస్టీ,ఎస్సీ,మైనార్టీ విద్యార్థి సమైక్య, విఎన్ఐవి ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఆర్ఐఒ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పధ్వీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సురేష్, విఎన్ఐవి జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేటు కళాశాలల విద్య మాఫియా రోజురోజుకూ పెరిగిపోతుందన్నారు. గత ఏడాది ఫీజుల కన్నా ఈ సంవత్సరం 50 శాతం ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల పెంచేశాయన్నారు. కళాశాల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలను వేల రూపాయలకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఆర్ఐఒ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపార్ట్‌మెంట్లలో కళాశాలలు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. జేఈఈ మెయిన్స్, ఐఐటి, కోస్పార్క్, వంటి కోర్సులు పేర్లు చెబుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. అనంతపురం నగరంలోని నారాయణ కళాశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘాలు సమాచారం ఇచ్చినప్పటికీ ఆర్ఐఒ స్పందించలేదన్నారు. కలెక్టర్ స్పందించి నిర్లక్ష్యంగా విధులను నిర్వహిస్తున్న ఆర్ఐఒను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిద్దు, శివ, చంద్ర, సోము, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు హనుమంతు, నరసింహ యాదవ్, అంజి, వెంకటరమణ నాయక్, ఉమా, వంశీ, విఎన్ఐవి నాయకులు లక్ష్మీపతి నాయక్ పాల్గొన్నారు.

బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలి : డిఇఒ

ప్రజాశక్తి-తాడిపత్రి

బడి మానేసిన పిల్లలందరినీ వందశాతం బడిలో చేర్పించాలని డిఇఒ వరలక్ష్మి సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మునిసిపల్ హైస్కూల్‌లో ఎంఇఒ నాగరాజు అధ్యక్షతన ఎంఇఒ, హెచ్‌ఎం, కెజిబివి ఎస్‌ఓలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ సెక్రటరీలు, సిఆర్‌పిలకు విద్య, పాఠశాల విధి విధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లో బాధ్యతాయుతంగా పర్యటించి బడి మానుకున్న పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. అలాగే బడికి రాని పిల్లలు ఉంటే తల్లిదండ్రులకు నచ్చజెప్పి బడిలో చేర్పించాలన్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు నూరుశాతం ఉండాలన్నారు. ప్రతి విద్యార్థికీ ఎప్పటికప్పుడు పంపిణీ అయ్యే విద్యార్థుల బ్యాగు, పుస్తకాలు తదితర కిట్టులను పరిశీలించి పంపిణీ చేయాలన్నారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటించాలన్నారు. పాఠశాల పరిసరాలు, వంటగది, మల, మూత్ర కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ వరలక్ష్మి

బిల్లుల చెల్లింపునకు బ్రేక్..!

◆నిలిచిన బిల్లుల అప్లోడింగ్

◆రూ.వందల కోట్ల అభివృద్ధి పనుల్లో నాణ్యతపై దృష్టి

◆గత ప్రభుత్వ నేతల బినామీలకు చిక్కులు



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు ఆగిపోయాయి. దీంతో పనులు చేసిన ముఖ్య నేతల బినామీలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో బిల్లులు మంజూరవని పాత పనుల నాణ్యతపై ప్రస్తుత అధికార పార్టీ నాయకులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నగరంలో రహదారులు ఎక్కడ చూసినా గుంతల మయంగా కన్పిస్తున్నాయి. వందల కోట్ల అభివద్ధి పనులు జరిగి ఉంటే మరి నాణ్యత ప్రమాణాల అమలు ఎలా ఉందన్న దానిపై అధికార పార్టీ ముఖ్య నేతలు ప్రశ్నిస్తున్నారు. నాశిరకంగా పనులు చేసి కాసులు దండుకున్నారా అన్న అంశం తేల్చే క్రమంలో గతంలో చేసిన అభివద్ధి పనుల బిల్లుల అప్లోడింగ్ ఆపాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివద్ధి పనుల బిల్లులను నూతన ప్రభుత్వ బాధ్యతలు చేపట్టక మునుపే అప్లోడింగ్ చేయించుకుని ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తలచిన ఓ ముఖ్య నేత బినామీలు సెలవు రోజుల్లో సైతం ఆరాటపడ్డారు. వీరి తంతును గమనించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కలెక్టరేట్లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల సమావేశంలో అభివద్ధి పనుల జాబితాను అందజేయాలని కోరారు. ఎక్కడెక్కడ ఏ పనులు ఏ మేరకు జరిగాయో చెప్పాలన్నారు. సందట్లో సడేమియా అన్నట్లుగా టెండర్ పనులను చేపట్టాలని ఓ కాంట్రాక్టర్ ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న అధికార పార్టీకి చెందిన వారు వాటిని అడ్డుకున్నారు. ఇప్పటివరకు చేసిన పనులు చాలని, నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు చేపట్టే అంశంపై తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పి వాటిని వెనక్కు పంపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివద్ధి పనుల బిల్లుల్లో దాదాపు ముఖ్య నేతకు చెందిన బినామీలదే కోట్ల రూపాయల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ బిల్లులన్నింటినీ అప్లోడ్ చేయకుండా ఆపాలంటూ అధికార పార్టీ ముఖ్య నేత నుంచి మౌఖిక ఆదేశాల రావడంతో అధికారులు తాత్కాలికంగా ఆ ప్రక్రియను నిలిపివేసినట్లు చర్చ జరుగుతోంది. కోట్ల రూపాయల బిల్లుల అప్లోడింగ్ ఆగిపోతే తమ బిల్లులు ఇప్పట్లో మంజూరయ్యే పరిస్థితి ఉండకపోవచ్చు అన్న అభిప్రాయం గత ప్రభుత్వ నేతల్లో వ్యక్తమవుతోంది. గతంలో తెలుగుదేశం హయాంలో వివిధ రకాల అభివద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు గతేడాది నవంబర్లో హైకోర్టు ఆదేశాల మేరకు చెల్లింపులు జరిగాయి. దాదాపు ఐదు సంవత్సరాలపాటు కాంట్రాక్టర్లు బిల్లుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. గతంలో సదరు బినామీలు చేపట్టే ప్రతి అభివద్ధి పని విషయంలో ముఖ్య నేత పేరు చెప్పి పబ్బం గడుపుకున్న వారందరూ ఇప్పుడు తలలు పట్టుకుని కూర్చొన్నారు. గతంలో చుట్టపు చూపుగా వచ్చి పోయే బినామీ కాంట్రాక్టర్లు గత కొన్ని రోజులుగా ఉదయం నుంచి సాయంకాలం వరకు సెలవులతో ప్రమేయం లేకుండా కార్పొరేషన్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా బిల్లుల అప్లోడ్ జరగకుండా ఆదేశాలు జారీ కావడంతో దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి బిల్లుల అప్లోడింగ్ వివిధ సాంకేతిక కారణాలతో జరగకుండా ఆగిపోయింది. ఆర్థిక సంవత్సరం ముగింపులో బిల్లుల చెల్లింపు పనులు పూర్తి కావాలని ఒత్తిళ్లు రాకుండా చూసేందుకు అప్పటి ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నగరంలో రూ.1100 కోట్ల అభివద్ధి పనులు జరిగాయని, ప్రతి సమావేశంలో ఆర్భాటంగా ప్రకటిస్తూ వచ్చారు. మారిన పరిస్థితుల్లో ప్రధాన రహదారులు గుంతల మయంగా మారటానికి మరే కారణం చెబుతారనే ప్రశ్నలు కూడా ప్రజల నుంచి ఉత్పన్నం అవుతున్నాయి. నూతన ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అభివద్ధి పనులపై దృష్టి కేంద్రీకరించటంతో నాణ్యత ప్రమాణాలు లోపించిన నాశిరకం పనుల ఫైళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అవినీతి డొంక కదిలి తీరుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



విలేకరులతో మాట్లాడుతున్న కౌలు రైతులు

ఆలయ భూమి వేలంపాటను రద్దు చేయాలి

ఇఒకు కౌలురైతుల వినతి

ప్రజాశక్తి-వజ్రకరూరు

విశ్వేశ్వరస్వామి ఆలయ భూముల వేలంపాటను వెంటనే రద్దు చేయాలని భూములను సాగు చేసుకునే కౌలు రైతులు కోరారు. ఈమేరకు మంగళవారం ఉరవకొండలోని విశ్వేశ్వరస్వామి ఆలయ కార్యాలయం వద్దకు చేరుకుని కౌలురైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వజ్రకరూరు మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామ పరిధిలో ఉన్న విశ్వేశ్వరస్వామి ఆలయానికి సర్వేనెంబర్ 23-బిలో, 33.36 ఎకరాల సాగు భూమిలో 1989వ సంవత్సరం నుంచి 2023 సంవత్సరం వరకూ 15 మంది మాదిగ కౌలు రైతు కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాయని తెలిపారు. వేలంపాటలో పాల్గొని ఆ భూమిని దక్కించుకునే ఆర్థికస్తోమత రైతులకు లేదన్న విషయాన్ని గమనించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పొలాలకు సంబంధించిన గుత్త చెల్లిస్తున్నామన్నారు. ఎస్సీ మాదిగ కులానికి చెందిన కౌలు రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఎప్పుడూ లేనివిధంగా వేలంపాట వేస్తామని దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గ్రామంలో దండోరా వేయించడంతో రైతులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారన్నారు. వేలంపాటను రద్దు చేసి ఇప్పటి వరకూ సాగులో ఉన్న కౌలు రైతులకు అవకాశం కల్పించి న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో డిజిహెచ్ఎస్ వ్యవస్థాపకులు గోపాల్, అంబేద్కర్ సేవా రాష్ట్ర నాయకులు రమేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు యల్లప్ప, పొట్టిపాడు గ్రామానికి చెందిన కౌలురైతులు రాజశేఖర్, శ్రీనివాసులు, పెన్నయ్య, సుంకన్న, గోవిందు, రామాంజనేయులు, కుళ్లాయప్ప, రామకృష్ణ, సుధాకర్, ఈరన్న, శ్రీరాములు, గోవిందు, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్‌ను బలోపేతం చేద్దాం

రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో కెవిపిఎస్ బలోపేతం కావాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా అవసరమని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నలప్ప పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో కెవిపిఎస్ జిల్లా జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో బిజెపి ప్రమాదం పెరుగుతోందన్నారు. ముఖ్యంగా రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలుగుతోందన్నారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ, వివిధ సంస్థలను బలహీన పరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తోందన్నారు. బిజెపికి మద్దతుగా నిలుస్తున్న రాష్ట్రంలో పాలక పార్టీలు మతోన్మాదాన్ని పెంచడానికి తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. దళిత, గిరిజన మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయన్నారు. దళితుల సంక్షేమానికి సంబంధించిన నిధుల్లో కోత విధించారన్నారు. ప్రభుత్వ రంగాన్ని నాశనం చేసి ప్రయివేటు రంగాలను ప్రోత్సహిస్తూ రిజర్వేషన్లను తొలగించే ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ కూటమి దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులకు ఉన్న రక్షణ చట్టాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కెవిపిఎస్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ సమయంలో గ్రామాల్లో కెవిపిఎస్ విస్తరించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దళితులకు భూమి కొనుగోలు పథకం, అంబేద్కర్ స్టడీ సర్కిళ్లను పునరుద్ధరణ చేయాలని, జిల్లాలో స్కీయార్డ్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, రాచేపల్లి వద్ద లెదర్ పార్కును పునరుద్ధరించాలని, డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛన్లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డప్పు, డ్రెస్సు, గజ్జలు ఇవ్వాలని, చర్మకారులకు వృత్తి పరికరాలను అందివ్వాలని, ప్రతి దళిత వాడకూ శ్మశాన స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, జగ్గిలి రమేష్, ఉరుముల కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి ఉరుముల వన్నూరప్ప, నగర అధ్యక్షులు అక్కులప్ప, అనంతపురం రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు జీవరత్నం, రాజా, జిల్లా కమిటీ సభ్యులు రామునాయక్, సూరి, అనంతపురం నల్లప్ప, నరసింహులు, యాలేరు నల్లప్ప, సుబ్బరాయుడు, శివ, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.నాగరాజు, గొడ్డుమర్రి శివ, నార్పల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీజీ ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో జెఎన్‌టియు ఓటిపిఆర్ఐ విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి-అనంతపురం



కె.గణేష్ 3వ ర్యాంకు



శ్రీనాథ్ 32వ ర్యాంకు



జాహ్నవి 57వ ర్యాంకు

ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఏపీ పీజీ ఈసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అనంతపురం జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ పార్మసీ విద్యార్థుల అత్యంత ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయిలో గణేష్ 3వ ర్యాంకు, చేకూరి శ్రీనాథ్ 32 ర్యాంకు, కె.జాహ్నవి 57వ ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా ఓటిపిఆర్ఐ డైరెక్టర్ ఆచార్య దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఓటీపీఆర్ఐ కళాశాల విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు సాధించడం గర్వకరాణంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు 100 లోపు ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. వీరితో పాటు కె. అనిల్ కుమార్ 117, జె.మౌనిక184, పి.యస్వంత్ 211, కె.ఇమ్రాన్ 268, ఎ.విజ్ఞత 302, గంగాధర్ 525, టి.సల్మా 525, కె.శ్రావణి 525, ఎం.శ్రావణి 608, జి.లిఖిత 812, సి.తులసి 812 ర్యాంకులు సాధించారన్నారు. అత్యుత్తమ ర్యాంకులు సాదించిన విద్యార్థులను జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు అభినందించారు.

తాడిపత్రి కౌన్సిల్ సమావేశంపై ఉత్కంఠ

నేడు మున్సిపల్ మీట్ - ఛైర్మన్ జెసి హాజరవుతారా.?

ప్రజాశక్తి-తాడిపత్రి



తాడపత్రి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఉత్కంఠ నెలకొంది. బుధవారం నాడు అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ కౌన్సిల్ సమావేశం ద్వారా తాడపత్రిలో నెలకొన్న సమస్యలు ప్రస్తావనకొస్తాయనే చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి హాజరవుతారా.. కారా..? అనే అంశంపై పట్టణంలో పెద్ద చర్చ నడుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఇరు పార్టీ నాయకులను జిల్లా పోలీసు యంత్రాంగం నియోజకవర్గ బహిష్కరణ చేసిన విషయం విధితమే. న్యాయశాఖ సైతం బహిష్కరణను సమ్మతిస్తూ జూన్ 28 వరకు ఇరు పార్టీ నాయకులను నియోజకవర్గంలోకి రావొద్దంటూ ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో సమస్యలకు తిష్ట వేసిన తాడిపత్రి మున్సిపాలిటీని గాడిన పెట్టేందుకు మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌కి హాజరవుతారనే చర్చ మొదలైంది. ఎన్నికల సమయంలో తలెత్తిన గొడవల కారణంగా కొంతమంది కౌన్సిలర్లు సైతం ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్నారు. ఈ క్రమంలో వైసిపికి చెందిన కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరవుతారా లేదా అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. నలుగురు వైసిపి కౌన్సిలర్లు ఎన్నికల ముందు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ కౌన్సిలర్లు హాజరు కాకపోయినప్పటికీ పట్టణంలోని ప్రధాన సమస్యలైన అండర్ డ్రైనేజీ, పారిశుధ్యం, పచ్చదనం సంరక్షణ, తాగునీరు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వాటిని గాడిలో పెట్టేందుకు తీర్మానాలు చేసేలా ఛైర్మన్ ఆధ్వర్యంలో సమావేశంలో చర్చ నడుస్తుందనే భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

మహిళా రక్షణ చట్టాలను సక్రమంగా అమలు చేయాలి

ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి

ప్రజాశక్తి-గుంతకల్లు



మాట్లాడుతున్న ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి

మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన రక్షణ చట్టాలను సక్రమంగా అమలు చేయాలని ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. అందుకు కారణం మహిళల రక్షణ చట్టాలను ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రతి జిల్లాకు మహిళ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, మహిళలును హింసిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.జ్యోతి, బి.రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు ఆదిలక్ష్మి, శాంతమ్మ, సుశీలాబాయి, సుగుణ, ఊషా, లక్ష్మీదేవి, గంగ రత్నమ్మ, బాను, గౌసియా, హుసేన్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉద్యోగి మల్లికార్జున ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా పరిషత్ ఉద్యోగి మల్లికార్జున మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఈయన బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడ పని చేస్తూనే డిప్యుటేషన్‌పై జెడ్పీకి వచ్చి పూర్వ సీఈఓ సీసీగా పని చేశారు. తర్వాత డిప్యుటేషన్ రద్దు చేసుకుని తిరిగి బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా వెళ్లిపోయారు. సోమవారం రాత్రి కొంచెం అస్వస్థతకు గురైనట్లు బంధువులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున వాకింగ్ వెళ్లేందుకు సిద్ధమైన ఆయన గుండె పట్టుకున్నట్లు ఉందంటూ భార్యకు చెప్పి.. ఆమె ఒళ్లోనే ఒరిగి తుదిశ్వాస వదిలారు. కాగా ఆయన ఎక్కడ పని చేసినా అందరితో కలివిడిగా, కలుపుగోలుగా ఉండేవారు. మృదుస్వభావిగా ఆయనకు మంచి పేరుంది. మలికార్జున గుండెపోటుతో మరణించారని తెలిసి జెడ్పీ ఉద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటన జెడ్పీ ఉద్యోగుల్లో విషాదం మిగిల్చింది.



మల్లికార్జున (పాతచిత్రం)

ముగిసిన ఎర్రితాతస్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల కేంద్రంలో వెలసిన ఎర్రితాతస్వామి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, బిల్వార్చన, పల్లకిసేవ, మహా మంగళ హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత స్వామివారు చంద్రప్రభ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం యువకుల కేరింతల మధ్య ఉట్లమాను కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ శివ పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

ఆర్ట్స్ కళాశాలలో సిఎం ఫొటో పెట్టకపోవడంపై నిరసన

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో టిడిపి ఘనవిజయం సాధించి చంద్రబాబు సిఎం అయ్యాక కూడా నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఫొటో ఏర్పాటు చేయకపోవడంపై విద్యార్థి సంఘాల నాయకుల, టిడిపి నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వాచ్చక కూడా కొంతమంది ప్రభుత్వ అధికారుల్లో చలనం రాకపోవడం బాధాకమరన్నారు. అనంతరం విద్యార్థి సంఘాలు, టిడిపి నాయకులు సిఎం చంద్రబాబు ఫొటో తీసుకొచ్చి కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అమర్‌యాదవ్, సతీష్, టిడిపి సీనియర్ నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జి గోపాల్‌గౌడ్, అభిరామ్, శివుడు, భరత్, పార్థ, భైరవనగర్ విజయ్‌బాబు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



సిఎం చిత్రపటాన్ని అందజేస్తున్న టిడిపి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

అన్ని గ్రామాల్లోనూ 'నేను బడికి పోతా' : ఎంపిడిఒ

ప్రజాశక్తి-వజ్రకరూరు

నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజు పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉరవకొండ ఎంపిడిఒ కార్యాలయ సమావేశ కార్యాలయంలో మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పిల్లవాడినీ వందశాతం బడిలో చేర్పించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు మనందరిపై ఉందన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా విద్యార్థులు బడికి వెళ్లకుండా ఉన్నట్లయితే వారి ఇళ్ల వద్దకు వెళ్లి విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఈశ్వరప్ప, రమాదేవి, కెజిబివి ప్రత్యేక అధికారిణి ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉర్దూ స్కూల్ ప్రధానోపాధ్యాయులు అష్రాఫ్‌వలి, ఉపాధ్యాయులు హరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్లు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పల్లె రఘునాథ్‌రెడ్డి ఎంబీఏ కళాశాలలో శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి ఆదేశాలతో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతీ సుజుకి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి పలువురు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేఉసకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్ సీఈవో ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్, ప్లేస్‌మెంట్ అధికారి బాబా ఫక్రుద్దీన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మారుతీ సుజుకీ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ సాయిచరణ్, ఎస్.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ



మొక్క నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-గుత్తి

మొక్కలను నాటి సంరక్షించడం ద్వారానే కాలుష్యాన్ని నివారించవచ్చని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం పట్టణంలోని జంగాల కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే ప్రాణవాయువు లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచిన హేత్వికరెడ్డి

రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో హేత్వికరెడ్డి ప్రతిభ

అనంతపురం : రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో అనంతపురం హౌసింగ్ బోర్డుకు చెందిన హేత్వికరెడ్డి ప్రతిభ కనబరిచింది. ఈనెల 21 నుంచి 23వతేదీ వరకూ తిరుపతిలో నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో అనంతపురం జట్టు తరుపున హేత్వికరెడ్డి పాల్గొని రెండు పతకాలు సాధించింది. హేత్వికరెడ్డి నగరంలోని సరస్వతి విద్యామందిరంలో రెండవ తరగతి చదువుతోంది. ఎన్టీఆర్ రోలర్ స్కేటింగ్ అకాడమీలో కోచ్ ఆంజనేయులు దగ్గర శిక్షణ తీసుకుంటోంది.

సిపిఐ సీనియర్ నాయకుడు మృతి



గుంతకల్లు : సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ అబ్దుల్ వహాబ్ (69) మంగళవారం స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. గత నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న వహాబ్ పరిస్థితి విషమించి మృతిచెందారు. ఈయన ఎఐటియుసి, సిపిఐ సీనియర్ నాయకులుగా కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. మరణ వార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్ తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

మళ్లీ విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయదుర్గం : రాయదుర్గం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మళ్లీ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సబ్‌స్టేషన్‌లోని లింబ్ పగిలిపోవడంతో వాటి స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు గంటసేపు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు విద్యుత్ శాఖ ఎఇ బాలచందర్ తెలిపారు. గత ఆదివారం కూడా సుమారు నాలుగు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. సోమవారం కూడా పట్టణంలోని నేతాజీ రోడ్డులో విద్యుత్ కేబుల్ తీగ తెగిపోవడంతో రాత్రి నేతాజీ రోడ్డు, ఓబులాచారి రోడ్డు, శాంతినగర్ పార్వతీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు బొమ్మనహాల్‌కు కలెక్టర్ రాక

బొమ్మనహాల్ : కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం మండలానికి రానున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని కెజిబివి కళాశాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని ఉద్దేహాల్‌లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య టీం మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా తల్లీబిడ్డ సంరక్షణ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది చేసిన సేవలు, పాఠశాల పిల్లలకు అందించిన వైద్య సేవలు, రికార్డులు, ఎంసీపీ రికార్డులు, దినసరి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ యుగంధర్, జిల్లా ఆరోగ్య వైద్య కార్యాలయం నుంచి హేమలత, కిషోర్, జరీనా, బొమ్మనహాల్ పిహెచ్‌సి సిబ్బంది, నర్సులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా ఆరోగ్య టీం

గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం



రైతులకు దానా పంపిణీ చేస్తున్న పశువైద్యులు

బెలుగుప్ప : రాష్ట్రీయ గోకుల్ మిషన్ అనే పథకం కింద మండల పరిధిలోని గంగవరం గ్రామంలో మంగళవారం ఉచిత గర్భ కోస వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ సుబ్రమణ్యం పశువులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌గుప్తా, బెలుగుప్ప పశువైద్యాధికారి రమేష్, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ హరిణీ, వెటర్నరీ అసిస్టెంట్ అశోక్, పశుసంవర్ధక నాయకులు మారుతి, మేటి ఎర్రిస్వామి, వంశీ, సుదర్శన్, చంద్ర, విజయ్‌కుమార్, సుధాకర్‌నాయక్, అనిల్, రవికుమార్, శ్రీరంగాపురం మారుతి, గోపాలమిత్ర పెద్దన్న, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇంధనాన్ని పొదుపు చేస్తూ..ప్రమాదాలను తగ్గించాలి

ప్రజాశక్తి-అనంతపురం

డ్రైవర్లు ఇందనాన్ని పొదుపు చేయడంతోపాటు ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేయాలని అనంతపురం రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయంలో ఇంధన పొదుపు, ప్రమాదాల నివారణపై రోజులపాటు నిర్వహించే డ్రైవర్ల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా పంచసూత్రాలు పాటిస్తూ ఇంధన పొదుపుని సాధించాలని సూచించారు. అంతేకాకుండా రక్షణాత్మక డ్రైవింగ్ పద్ధతులు, ట్రాఫిక్ సూచనలను పాటిస్తూ ప్రమాదాలను తగ్గించాలని తెలిపారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ పి.రమేష్‌బాబు మనం పెట్టే ఖర్చులో దాదాపుగా 30 శాతం వరకూ ఇంధనంపై పెడుతున్నామన్నారు. భావితరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపును పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ల ట్రైనర్ ఎస్ఎండి హనీఫ్, అనంతపురం డిపో మేనేజర్ పి.నాగభూపాల్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.నారాయణస్వామి, శ్రీ సత్యసాయి జిల్లా అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.ఖాజావలి, సాయిప్రసాద్, అనంతపురం, సత్యసాయి జిల్లా డిపోలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని

మంత్రి దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ అమలు చేయాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ కార్మికులు మంగళవారం తాడేపల్లిగూడెంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 16 రోజుల సమ్మె పోరాటంలో భాగంగా స్కిల్డ్, సెమిస్కిల్డ్ అమలు చేస్తామని, 9మంది ఐఎఎస్ కమిటీ నివేదిక ఇచ్చినా సమస్యలను పరిష్కరించలేదన్నారు. కావున ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు మంత్రులు స్పందించి పదిరోజుల్లోగా ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయకత్వంతో చర్చలు జరిపి అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రులను కలిసిన వారిలో కార్మికులు మల్లికార్జున, సంజీవరాయుడు, ఓబుళపతి, మురళీ, పోతులయ్య, సుబ్బిరెడ్డి, తదితరులు ఉన్నారు.



మంత్రి నారాయణను కలిసి సమస్యలను విన్నవిస్తున్న అనంతపురం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-వజ్రకరూరు

పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉరవకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత అన్నారు. మంగళవారం స్థానిక కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లను నాటడంతోపాటు పరిరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఎక్కడో ఓచోట ఓ మొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఒకేషనల్ సిరికల్చర్ అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలను నాటి వదిలివేయకుండా దత్తత తీసుకుని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివప్రసాద్, ఖాదర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మమత, అధ్యాపకులు

సీజనల్ వ్యాధులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

నార్పల : మండల పరిధిలోని శిద్ధరాచర్ల గ్రామపంచాయతీ సచివాలయంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి సాకే రామాంజనేయులు మాట్లాడుతూ వైద్య సిబ్బంది డయేరియాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి దగ్గర, పరిసర ప్రాంతాల్లో మురుగునీరు లేకుండా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు

వసూళ్లకు పాల్పడుతున్న పాఠశాలలపై చర్యకు డిమాండ్

గుత్తి : పట్టణంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహశీల్దార్ బి.భారతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చిన్న, ఉపాధ్యక్షులు విజయ్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు అదనపు తరగతుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అలీ, నరసింహా, సునీల్, మనోహర్, రాము, దేవా, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిత్యావసర వస్తువులు, కూరగాయలు, తినుబండారులను అధిక ధరలకు విక్రయిస్తున్న, తూకాల్లో మోసం, కల్తీ తదితర వాటిపై చర్యలు తీసుకోవాలని కన్జుమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.మోహన్, కెఎం.అసాదుల్లాలు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు అవుతున్నాయన్నారు. ఇక్కడ తయారు చేసే ఆహార పదార్థాల్లో రుచి పేరుతో రసాయనాలు కలుపుతున్నారన్నారు. వీటిని తిన్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. దీనిపై సిఎస్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన జనసేన నేత మంజునాథ్‌గౌడ్

రాయదుర్గం : జనసేన పార్టీ రాయదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరేగౌడ్ర మంజునాథ్‌గౌడ్ మంగళవారం విజయవాడలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంజునాథగౌడ్ ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కంటే రాయదుర్గం కూటమి అభ్యర్థి కాలువ శ్రీనివాసులును అత్యధిక మెజారిటీతో గెలిపించడం పట్ల అభినందనలు తెలిపినట్లు వివరించారు. అలాగే జిల్లా సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

రాములమ్మ అమ్మవారి వార్షిక హారతి ఉత్సవాలు

పామిడి : పట్టణంలోని కొండూరు రోడ్డు వద్ద వెలసిన రాములమ్మ అమ్మవారి వార్షిక హారతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు అమ్మవారికి పిండివంటలు, అన్నం సమర్పించి హారతులు ఇచ్చారు. వేకువజామున అభిషేక, అర్చనలు చేశారు. తర్వాత పూలమాలలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో సురేష్‌రావు, రమేష్‌రావు, కింగకాంగ్‌రావు, నాగరాజరావు, అమ్మవారి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎస్టీఎల్‌కు వీడ్కోలు

పామిడి : బదిలీపై వెళ్తున్న ఆర్డీటీ బికెఎస్ రీజన్ ఎస్‌టిఎల్ ఇంద్రప్రసన్నకు మంగళవారం స్థానికులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇంద్రప్రసన్న రీజన్‌పరిధిలో 13 మండలాలకు నాలుగేళ్లుగా చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహించారన్నారు. ఇంద్రప్రసన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కేశవాచారి, సర్వేస్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌టిఎల్ ఇంద్రప్రసన్నను సన్మానిస్తున్న దృశ్యం

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

డయేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారులు ఇందిరా ప్రియదర్శిని, స్వాతిలక్ష్మి సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో డయేరియాపై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి 0-5లోపు పిల్లలను గుర్తించాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా చిన్నారులకు నీళ్ల విరోచనాలు అయితే ఓఆర్ఎస్ తాపడంతోపాటు జింక్ మాత్రలను వేయాలన్నారు. ఇకపోతే ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్‌బాబు, మోహన్‌రావు, సామాజిక ఆరోగ్య అధికారులు పర్వీన్, చెన్నమ్మ, సూపర్‌వైజర్లు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : డయేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిహెచ్ఒ మురళీధర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ రమేష్ ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు డయేరియా నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళీధర్ మాట్లాడుతూ డయేరియా రాకుండా వైద్యసిబ్బంది గ్రామాల్లో చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో శానిటేషన్ చేయాలని సూచించారు. అలాగే ప్రతిఇంటికీ ఓఆర్ఎస్ పాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న వైద్యసిబ్బంది

ఒకవేళ పిల్లలకు నీళ్ల విరోచనాలు మొదలైతే వెంటనే ఓఆర్ఎస్ పాకెట్లు తాగించాలన్నారు. దీంతోపాటు 14 రోజుల వరకూ జింక్‌మాత్రలు వేయాలన్నారు. తర్వాత తమ సిబ్బందికి తెలియజేసి పిల్లలు రోగాలు బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, సూపర్‌వైజర్ జయమ్మ, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : డయేరియా నివారణ చర్యలు చేపడతామని ఇఒఆర్‌డి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం ఉరవకొండ మండల పరిధిలోని మోపిడి గ్రామంలో డయోరియా (అతిసార) నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగారంగయ్య, ఇఒఆర్‌డి చంద్రమౌళి, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి రమణ, అనూషా, ఆశాలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వీరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని దేవుని ఉప్పలపాడు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి డయేరియా నివారణపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తర్వాత ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి క్లోరిన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈకార్యక్రంలో పంచాయతీ కార్యదర్శి డి.రమేష్‌బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు శర్మష్‌వలి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఉరవకొండ మండలంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది